క్లుప్తంగా

పండించిన పంటకు ప్రభుత్వం అండ

గోగులపాడులో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: మండలంలోని గోగులపాడు గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం రాత్రి విస్తృతంగా పర్యటించారు. రైతులు ఈ ఏడాది పండించిన పంట దిగుబడులు మార్కెట్‌లో రేట్లను అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలుచేస్తోందన్నారు. అలాగే గ్రామానికి కావల్సిన మౌలిక సదుపాయాలు, ఇప్పటివరకు ఒనగూరిన సౌకర్యాలపై సమీక్షించారు. వృద్ధులు, డ్వాక్రా మహిళలతో విడివిడిగా వారి సమస్యలను, వారికి అందుతున్న రాయితీలు, సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబులురెడ్డి, జిల్లా ప్రచార కన్వీనర్ జి.ఉత్తమరెడ్డి, ఎంపీపీ గద్దం వెంకటరావు, మార్కెట్ యార్డు చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, గ్రామ సర్పంచ్ ముంద్రు హరినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు దావులూరి అంజయ్య, గుండా వెంకటేష్, తుర్లపాటి కొండలు, ముంద్రు శ్రీనివాసరావు, గోవిందరాజు, గెల్లి చినకోటిరెడ్డి, అన్నెంపున్నారెడ్డి, మోతుకూరి వెంకట్ పాల్గొన్నారు.

7న మినీ జాబ్‌మేళా

చిలకలూరిపేటటౌన్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ వారి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్సెంజ్, సీడప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మినీ జాబ్ మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణేయ్ చెప్పారు. శనివారం ఒక ప్రకటనలో ఈ నెల 7వ తేదీ మంగళవారం పట్టణంలోని రాగన్నపాలెం కమ్యునిటీ హాలులో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌లో ఫిన్‌కెర్ బ్యాంక్, ఎస్ఎస్ ఇన్స్‌ట్రుమెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తదితర కంపెనీలు పాల్గొన నున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ తదితర విద్యార్హతలు కలిగి, 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు, ఆధార్‌కార్డు, విద్యార్హతల సర్టిఫికేట్లతో హాజరుకావాలని కోరారు.

కుమారుడు తప్పిపోయాడయ్యా..!



తన్నీరు పోలయ్య (ఫైల్)

నాదెండ్ల: తన కుమారుడు వారం రోజులుగా కనిపించడం లేదంటూ గణపవరం గ్రామానికి చెందిన తన్నీరు అంకమ్మ శనివారం ఫిర్యాదు చేశాడు. తన కుమారుడు తన్నీరు పోలయ్య భార్య రాణీ రెండేళ్ల కిందట రాణీ క్యాన్సర్‌తో మృతి చెందింది. అప్పటి నుంచి తన వద్దే ఉంటున్న తన కుమారుడు గతనెల 27వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. నాటి నుంచి కుమారుడి ఆచూకీ కోసం బంధు మిత్రులున్న అన్నిచోట్ల గాలించగా లాభం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తండ్రి ఫిర్యాదుతో నాదెండ్ల ఎస్ఐ ఎ భాస్కర్ కేసు నమోదు చేసుకున్నారు.

జగనన్న కాలనీలు సత్వరమే పూర్తి చేయాలి

వినుకొండ ఎంపీపీ మేడం జయరామిరెడ్డి

వినుకొండ(నూజెండ్ల): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీడీవో జిలానీబాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం సత్వరమే పూర్తి చేయాలని, ఇప్పటికే పూర్తయిన కాలనీల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ సచివాలయాల ఉద్యోగులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సూచనలు పాటిస్తూ సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా అధికారులు చూడాలని కోరారు. అవసరమైన చోట నూతన బోర్ల నిర్మాణాలు, పనిచేయని బోర్ల మరమ్మతులు చేయాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, సొసైటీ చైర్మన్‌లు పొట్లపల్లి పిచ్చిరెడ్డి, పారా వెంకటేశ్వర్లుతో పాటు అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

వినుకొండ (నూజెండ్ల): స్థానిక వినుకొండ మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఎంపీడీవో మంగాపురనాథ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎంపీపీ పగడాల జయశ్రీ వెంకటరామిరెడ్డి పాల్గొని మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్న పథకాలను అందరికీ అందేలా అధికారులు పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. అర్హులైన వారిని గుర్తించి వారికి కూడా ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటింటి సర్వే చేపట్టి సమస్యలను గుర్తించాలని సూచించారు.

స్కూలుకు పంపితే చాలు..

ఎండాకాలం.. ఇంటిపట్టున ఉండని చిన్నారుల కోసం, డ్రాపవుట్స్ తగ్గించడానికి జగనన్న ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పిల్లలకు బడిలో కావల్సినవి ఉంటే బడికి వెళ్లమని మారం చేయరు. అలాంటి సదుపాయాలు కల్పించి రెండు మాసాలపాటు శిక్షణ ఇప్పించేందుకు శ్రీకారం చుట్టింది. ఇందుకు యడ్లపాడు మండలం సంగం గోపాలపురం ఎస్టీ ప్రాథమిక పాఠశాల వేదికగా నిలిచింది.

- ఉదయం అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు అక్కడే
- సంగంగోపాలపురం పాఠశాలలో సీజనల్ హాస్టల్ కార్యక్రమం
- మార్చి, ఏప్రిల్ మాసాలలో విద్యాబోధన



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బాబూరావు, గ్రామపెద్దలు (ఫైల్)

యడ్లపాడు: మండలంలోని సంగం గోపాలపురం ఎస్టీ ప్రాథమిక పాఠశాలకు మంచి రోజులొచ్చాయి. అత్యధికంగా ఎస్టీ యానాదుల కుటుంబాలకు చెందిన పిల్లలు అభ్యసించే ఈ పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా సమగ్రశిక్ష సీజనల్ హాస్టల్ కార్యక్రమం మంజూరైంది. మార్చి, ఏప్రిల్ రెండు నెలలు ఈ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుంది. విద్యార్థులు ఉదయం కాలకృత్యాలు తీర్చుకుని మంచి బట్టలు వేసుకుని పాఠశాలకు వస్తే చాలు. ఉదయం టిఫెన్ నుంచి రాత్రి భోజనం వరకు అక్కడే తింటూ చదువుకోవాల్సి ఉంటుంది. గుంటూరు జిల్లాకు చెందిన సర్వీస్ విత్ లవ్ అనే స్వచ్ఛంద సంస్థ వీటి నిర్వహణను పర్యవేక్షిస్తుంది.

కార్యక్రమ వివరాలు...

ఉదయం 8 గంటలకు విద్యార్థులు స్కూల్‌కు వెళ్లిన విద్యార్థులు అప్పటికే సిద్ధం చేసిన టిఫెన్‌ను ఆరగించి అసెంబ్లీలో పాల్గొనాల్సి ఉంటుంది. అనంతరం మధ్యాహ్నం పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమం వినియోగించుకుంటారు. సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యావలంటీర్ స్కూల్ ప్రాంగణంలోనే 5 నుంచి 6 గంటల వరకు గంటసేపు స్టడీ అవర్ ఏర్పాటు చేస్తారు. అది పూర్తయిన వెంటనే సంస్థ సిద్ధం చేసిన భోజనం చేసి ఇళ్లకు వెళ్తారు.

ఇవి ప్రయోజనాలు...

పాఠశాలలో చదివే 53 మంది విద్యార్థులకు పూర్తి స్థాయి ఆహారం అందుతుంది. అలాగే డ్రాపౌట్స్ సంఖ్య తగ్గిపోతుంది. వేసవి ఎండలకు తిరిగే ఆస్కారం ఉండదు. అందరూ వ్యవసాయ కూలీ, క్వారీ, మిల్లు కార్మిక కుటుంబాలు కావడంతో కొంత భారం తగ్గుతుంది. ఉదయాన్నే పాఠశాలకు వేళవుతుంది టిఫెన్ సిద్ధం చేయాలన్న కంగారు ఉండదు. వేళకు తినే అవకాశం ఉంటుంది. వ్యవసాయం, క్వారీ, మిల్లులకు వెళ్లి తమ పిల్లలు భోజనం చేశారో దిగులు ఉండదు. పాఠశాల ముగిశాక ఎక్కడెక్కడ తిరుగుతున్నారో అనే టెన్షన్ అక్కర్లేదు. తల్లిదండ్రులు పనుల నుంచి ఇంటికి వచ్చాకనే తమ పిల్లలు వస్తారనే ధైర్యం ఉంటుంది. పాఠశాల ముగిశాక తిరిగి స్టడీ అవర్ ఉన్నందున పాఠ్యాంశాలు తిరిగి పునశ్చరణ చేసుకునే వీలుంటుంది. అదే ఇంటికి వస్తే నిరక్షరాస్యులైన పేరెంట్స్ వాటిని చెప్పడం కష్టతరం అవుతుంది.

ప్రారంభం ఇలా..

సీజనల్ హాస్టల్ కార్యక్రమం సర్పంచ్ మల్లవరపు పోలవతి, గ్రామపెద్దలు బసెల శివరామకృష్ణ శుక్రవారం నుంచి ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధులు వేళంగిణి, బాబూరావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఉద్దేశం, ప్రయోజనాలను గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకునేలా పేరెంట్స్ ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో అతిథులతో పాటు హెచ్ఎం సమత, ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు ప్రసంగించారు.

ఆర్టీసీ బలోపేతానికి ముఖ్యమంత్రి కృషి

రెండు నూతన పల్లెవెలుగు బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



బస్సులకు పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, ఆర్టీసీ అధికారులు

నరసరావుపేట: ఆర్టీసీ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందజేసేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. స్థానిక డిపో నుంచి నరసరావుపేట–గుంటూరుల మధ్య తిరిగే రెండు నూతన పల్లెవెలుగు బస్సులను శనివారం రిబ్బన్ కట్‌చేసి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు బస్సులతో డిపోలో 12 పల్లె వెలుగు సర్వీసులు ప్రజలకు సేవలు అందజేస్తున్నాయన్నారు. సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయటంతో పాటు లాభాల బాట పట్టించేందుకు నూతన బస్సులను ఏర్పాటు చేసి ఇటు ఉద్యోగులు, అటు ప్రయాణికుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ నిర్ణయాలు తీసుకున్నారన్నారు. సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు, స్థానిక అధికారులు ఇటీవల ముగిసిన కోటప్పకొండ మహా తిరునాళ్లను విజయవంతం చేశారని, చార్జీలు పెంచకపోయినా గతేడాది కంటే రూ.8 లక్షల వరకు అదనపు ఆదాయం సంస్థకు చేకూర్చారన్నారు. ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులకు తెలుపురంగు రేషన్ కార్డులకు అర్హులు చేశారన్నారు. వారికి ప్రభుత్వం చేస్తున్న సహాయ సహకారాలను గుర్తుంచుకొని మళ్లీ సీఎంగా జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు ఉద్యోగులు మద్దతు పలకాలని కోరారు. సమావేశంలో ఆర్ఎం ఎస్.శ్రీనివాసరావు, డీఎం బత్తుల వీరాస్వామి, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, బత్తుల విష్ణు, పలు యూనియన్ల నాయకులు కోటేశ్వరరావు, షేక్ ఆసీఫ్, షేక్ జాని, ఎంఆర్‌కే రెడ్డి, సీహెచ్.మోహన్ రెడ్డి ఉద్యోగులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు సమన్వయంతో పనిచేయాలి

మండల ప్రత్యేక అధికారి లోతేటి వరలక్ష్మి



శానంపూడిలో ఘన వ్యర్థాల కేంద్రాన్ని సందర్శించి మాట్లాడుతున్న అధికారులు

శావల్యాపురం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అధిగమించటానికి అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో తమ విధులు బాధ్యతగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి లోతేటి వరలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని శానంపూడి గ్రామ సచివాలయాన్ని చెత్త సంపద కేంద్రాలను సందర్శించి అనంతరం కాఫీ, క్లాప్‌మిత్రలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారిణి మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాలు మేరకు ప్రతి గ్రామసచివాలయ పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా అందించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజలకు ప్రభుత్వానికి వారిధిగా పనిచేస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్నారు. అలాగే సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని నెలకు 250 సర్వీసులు తగ్గకుండా చూడాలన్నారు. గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రత పాటు ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రంగా పాటించాలన్నారు. గ్రామపంచాయతీల్లో ముఖ్యంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు అన్నీ శాఖల అధికారులు బాధ్యత వహించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటి తిరిగి తడి, పొడి చెత్తాను సేకరించి ఘన వ్యర్థాలకు తరలించి తద్వారా పంచాయతీకు ఆదాయ మార్గాలకు పెంపుదల చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య,ఈవోపీఆర్‌డి పి.సుగుణ. సర్పంచ్ మొనపాటి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, పంచాయతీ కార్యదర్శులు ముంద్రు మనోహార్,డి.ప్రతిమ, సచివాలయ ఉద్యోగులు బాలకృష్ణ,సురేష్,బాజీషైదా, తదితరులు పాల్గొన్నారు.

షాపుల వేలానికి కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ దస్తగిరి, కౌన్సిల్ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వినుకొండ పురపాలక సంఘం సమావేశ మందిరంలో సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వినుకొండ పురపాలక సంఘం పరిధిలోని నరసరావుపేట రోడ్డులో ఖాళీ స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్‌లో నిర్మాణానికి 246 షాపులకు రూ.29.10 కోట్లు అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు షెడ్యూల్ కులాల వారికి 15 శాతం, తెగల వారికి 6 శాతం, వికలాంగులకు 3 శాతం, నాయీబ్రాహ్మణులు, వాషర్‌మేన్, కోఆపరేటివ్ సొసైటీలకు 5 శాతం షాపులు కేటాయించడం జరుగుతుందని చెప్పారు. గుడ్‌విల్ పద్ధతిపైన నిర్మించే షాపుల వేలం పాట నిర్వహించేందుకు కౌన్సిల్ తీర్మానం చేశారు. వేలంలో పాల్గొనే వారు షరతులు అంగీకరించినట్లు మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. వేలంలో షాపులు దక్కించుకున్న వారు డిపాజిట్ మొత్తం డీడీ రూపంలో చెల్లించాలని, వేలం నిబంధనల ప్రకారం పెచ్చుపాటదారులకు రూమ్‌లు కేటాయించాలన్నారు. లీజు పరిమితి 5 సంవత్సరాలు నిర్ణయించినట్లు కౌన్సిల్‌లో తీర్మానం చేశారు.

అలాగే పురపాలక సంఘం పరిధిలోని మహాత్మాగాంధీ మున్సిపల్ కాంప్లెక్స్ నందు షాపు నెం. 8 లీజు కాలం ముగిసినందున బహిరంగ వేలం వేయాలని నిర్ణయించారు. పట్టణంలోని జగనన్న కాలనీలో నీటి సరఫరా కోసం 4 నెలల పాటు రూ.5 లక్షలు ఖర్చవుతుందని, అలాగే పట్టణంలో సంచరిస్తున్న కోతులు, కుక్కలు పట్టుకునేందుకు ఆమోదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తెల్లాకుల రాజేష్‌ఖన్నా, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నో బ్యాగ్‌డేతో విద్యార్థుల్లో సృజనాత్మకత



సృజన శనివారంలో పాల్గొన్న విద్యార్థులు

చిలకలూరిపేట: విద్యార్థుల్లో సృజనాత్మకత, సునిశిత పరిశీలన లక్షణాలను పెంపొందించేందుకు నో బ్యాగ్‌డే ఎంతో ఉపయోగపడుతుందని ఎంసీఆర్ మున్సిపల్ స్కూల్ హెచ్‌ఎం కె.సుధ చెప్పారు. పాఠశాలలో నో బ్యాగ్‌డే, సృజన శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి సెషన్‌లో విద్యార్థులచే బొమ్మలు వేయించటం, రంగులు వేయించటం చేశారు. రెండో సెషన్‌లో తోటకు పోదాం, పరిశుభ్రత పాటించటం, తరగతి గదులు, పాఠశాల ఆవాస ప్రాంతం పరిశుభ్రం చేయడం చేయించారు. మూడో సెషన్స్‌లో చదువుకుందాం, పాఠశాల గ్రంథాలయ పుస్తకాలను చదివించటం జరిగింది.

నాల్గో సెషన్‌లో విద్యార్థులకు పలు విషయాలపై ఉపాధ్యాయులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం మాట్లాడుతూ సృజన శనివారం కార్యక్రమంతో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని వెల్లడించారు. పరిసరాలపై అవగాహన పెరగడటంతో పాటు పరిశీలన శక్తి పెరుగుతుందన్నారు. విద్యార్థులలో సహకార భావన, స్నేహ భావం పెరుగుతుందన్నారు. తక్కువ ఖర్చుతో బోధన పరికరాల తయారీ విధానం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, టి.కుమారి పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి సామగ్రి వితరణ



మసీదు పెద్దలకు ఫ్యాన్లు అందజేస్తున్న పడాల శివారెడ్డి ఇతర నాయకులు

రొంపిచర్ల: స్థానిక చెరువుకట్ట సెంటర్లో నూతనంగా నిర్మించనున్న మసీదు నిర్మాణానికి పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు పడాల శివారెడ్డి వారి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో శనివారం రూ.3 లక్షల రూపాయల విలువైన టైల్స్, విద్యుత్ సామాన్లు, ఫ్యాన్లు బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు పడాల శివారెడ్డి మాట్లాడుతూ దైవ కార్యక్రమాలు నిర్వహణకు తమ వంతుగా సహకరిస్తామని అన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మసీదుకు శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.2 లక్షల రూపాయల విలువ చేసే ఇనుము మెటీరియల్ ఇచ్చారన్నారు. తమ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో మసీదు నిర్మాణానికి రూ.3 లక్షల రూపాయల విలువ చేసే మెటీరియల్ అందజేశామన్నారు. అదే విధంగా గ్రామంలో ముస్లిం సోదరుడుకు చెందిన ఖబర్దస్తాన్‌కు ప్రహరీ నిర్మించటం జరిగిందన్నారు. ప్రతి ఏడాది రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మసీదు నిర్మాణానికి మెటీరియల్ బహుకరించిన పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు పడాల శివారెడ్డి, వారి ఫ్రెండ్ సర్కిల్ అబ్దుల్ రహీం, జమీర్, షఫి, సోహెల్, రహీంలను ముస్లిం సోదరులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మసీదు నిర్మాణ కమిటీ సభ్యులు, ముస్లిం సోదరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిమ్స్ వైద్యకళాశాలకు మృతదేహం అప్పగింత



మృతదేహాన్ని నిమ్స్‌కు తరలిస్తున్న డాక్టర్లు

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన సరికొండ అంజంరాజు (61) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి సోదరుడు, స్థానిక భగత్ సింగ్ భవన నిర్వహణ కమిటీ సభ్యులు సరికొండ శేషరాజు శనివారం తన సోదరుడు అంజంరాజు మృతదేహాన్ని విజయవాడకు చెందిన నిమ్స్ వైద్యశాలకు అప్పగించారు. అదే విధంగా తన సోదరుడు నేత్రాలను విజయవాడకు చెందిన ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేసినట్లు శేషంరాజు తెలిపారు. విజయవాడకు చెందిన నిమ్స్ వైద్యకళాశాల గుంటూరు జిల్లా కో–ఆర్డినేటర్ చంద్రపాటి చలపతిరావు ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది గ్రామానికి వచ్చి అంజంరాజు మృతదేహాన్ని కళాశాలకు తీసుకెళ్లారు. తమ కళాశాలలో వైద్యపరీక్షల నిమిత్తం ఉపయోగపడే విధంగా శరీర అవయవ దానమును ప్రోత్సహిస్తున్నామని కో–ఆర్డినేటర్ చలపతిరావు తెలిపారు. తన సోదరుడు మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించిన శేషంరాజును గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ భవన నిర్వహణ కమిటీ సభ్యులు సరికొండ రామకృష్ణంరాజు, బి.ఆంజనేయరెడ్డి, మస్తాన్‌వలి, సుబ్బరాజు పాల్గొన్నారు.

రూ.1200 కోట్ల వ్యయంతో జలజీవన్‌మిషన్ పథకం

- ఐదు నియోజకవర్గాలు పరిధిలో నిర్వహణ
- శాశ్వత మంచినీటి సమస్య పరిష్కార దిశగా చర్యలు
- డీఈ రాచవేల్పూల కుమార్‌రాజు

శావల్యాపురం: కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో జలజీవన్ మిషన్ పథకం నిధుల రూ.1200 కోట్ల వ్యయంతో ఐదు నియోజకవర్గాలు పరిధిలో గ్రామాల్లోని ప్రజలకు శాశ్వత మంచినీటి సమస్య పరిష్కార దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాచవేల్పూల కుమార్‌రాజు శనివారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన ఆయన సాక్షితో మాట్లాడారు. జిల్లా కలెక్టరు సారథ్యంలో అన్నీ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు ఆధ్వర్యంలో వినుకొండ, మాచర్ల, గురజాల, నరసరావుపేట, సత్తెనపల్లి నియోజకవర్గాల్లోని అన్నీ గ్రామాల్లో ఇంటింటికీ నీటి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. నాగార్జునసాగర్ జలశయం పరిధిలో వాటర్‌గ్రిడ్ ఒవర్‌హెడ్ బ్యాలెన్స్ రిజర్వాయర్ (బావి) నిర్మాణ పనులు చేపట్టి తదుపరి అయా గ్రామాల్లో 30 మీటర్ల ఎత్తుతో కూడిన ఓవర్‌హెడ్ ట్యాంకులను ఏర్పాటు చేశామన్నారు.

రెండు సంవత్సరాల వ్యవధిలో పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఇందుకుగాను అన్నీ నియోజకవర్గాల్లో గ్రామాల్లో సర్వే పనులు తుదిదశకు చేరినట్లు చెప్పారు. టెండరు ప్రక్రియ పూర్తి అయిందని రాఘవ కన్‌స్ట్రక్షన్ వారి సారథ్యంలో పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు ఏఈ మూఢవత్ ఆకాష్ నాయక్ ఉన్నారు.

9,10 తేదీల్లో నీటి సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా మంచినీటి సరఫరా ప్రధాన పైపులైన్ ఇంటర్ కనెక్షన్ల కారణంగా ఈ నెల 9, 10తేదీల్లో రెండు రోజుల పాటు మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు తెలిపారు. ఈ విషయమై పట్టణ ప్రజలు ముందు జాగ్రత్తగా ఆయా ప్రాంతాలను బట్టి ముందుగానే నీటిని నిల్వ చేసుకోవాలని సూచించారు. 9తేదీకి ముందు మంచినీటి సరఫరా పూర్తి స్థాయిలో చేస్తామని పేర్కొన్నారు.

హక్కుల అధ్యయనంతోనే సమాజంలో రాణింపు

నరసరావుపేట టౌన్: మహిళలు తమ హక్కులను తెలుసుకోవటం ద్వారా సమాజంలో అన్ని రంగాల్లో రాణించవచ్చని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రవల్లిక అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం డ్వాక్రా కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు ఉందన్నారు. భార్యా, పిల్లలను పోషించని భర్తల వద్ద నుంచి చట్టరీత్యా తగు పరిహారం పొందవచ్చన్నారు. అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి మధుస్వామి మాట్లాడుతూ న్యాయవాదులు ఏర్పాటు చేసుకునేందుకు స్థోమత లేని వారు మండల న్యాయ సహాయక కేంద్రాన్ని ఆశ్రయిస్తే ఉచిత న్యాయ సహాయం అందజేయబడుతుందన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండి తమ హక్కులను పొందాలన్నారు.

సాతులూరులో 104 వైద్య సేవలు

నాదెండ్ల: సాతులూరు హెల్త్ సబ్‌సెంటర్–1లో శనివారం 104 సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రసన్న కుమార్ 140 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

రేపు ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

యడ్లపాడు: మండలంలోని సంగంగోపాలపురం–చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామాల మధ్య వేంచేసి ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి 39వ తిరునాళ్ల మహోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేకువ జామునుంచే తిరునాళ్లకు సందర్భంగా ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు ప్రారంభం అవుతాయన్నారు. తిరునాళ్లకు విచ్చేసిన భక్తులకు ఉదయం 11 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఉంటుదన్నారు. సాయంత్రం భారీ విద్యుత్ ప్రభలతో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస గ్రామస్తులతో పాటు సమీప ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని కృపకు పాత్రులు కావల్సింది కోరారు.

మహిళపై దాడి చేశారంటూ ఫిర్యాదు

నాదెండ్ల: పాతకక్షల నేపథ్యంలో అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు దాడి చేసినట్లు పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. మండలంలోని గొరిజవోలు గ్రామం ఎస్సీకాలనీకి చెందిన పసల స్వప్న అదే గ్రామానికి చెందిన అల్లడి అంకమ్మరావు, జూపల్లి మరియదాసు, గారపాటి ప్రభుదాసుతో పాటు మరో ఏడుగురు ఈనెల రెండోతేదీన తన ఇంటిపైకి వచ్చి దాడి చేశారంటూ ఆమె ఫిర్యాదులో పేర్కొంది. గాయపడిన ఆమె నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎ.భాస్కర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమెన్స్ డే

చిలకలూరిపేటటౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ, చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఉమెన్స్‌డేను పురస్కరించుకొని వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె నరేంద్రరెడ్డి చెప్పారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం మహిళల హక్కులు, వరకట్న, లైంగిక వేధింపులు, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాలు ఈ నెల నాలుగోతేదీ నుంచి 11 తేదీ వరకు కొనసాగుతున్నాయన్నారు.

పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలి

నాదెండ్ల: గ్రామంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ చెప్పారు. నాదెండ్ల గ్రామంలో శనివారం కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులతో మమేకమయ్యారు. వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యాలయం నుంచి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సీనియర్ పారిశుద్ధ్య కార్మికులను శాలువ కప్పి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో ఐ.ఆంజనేయులు, హౌసింగ్ ఏఈ రామకృష్ణ నాయక్, ఉపాధి హామీ పథకం ఏపీవో పుష్పరాజు, సచివాలయం కార్యదర్శులు ఎ.శేఖర్, కె.ఫణిబాబు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

చిలకలూరిపేట: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని పండరీపురంలో ఉన్న మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకుల ప్రాంగణాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరా ట్యాంకర్ల వివరాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి సమస్య ఉత్పన్నం కాకుండా అవసరమైన అదనపు ట్యాంకర్లను ఏర్పాటు చేస్తామన్నారు. మంచినీరు పైపులైన్ల ద్వారా సరఫరా కాని శివారు కాలనీలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వివరించారు.

డంపింగ్ యార్డ్ నిర్వహణపై సమీక్ష

రొంపిచర్ల: స్థానిక సుబ్బారెడ్డి కాలనీలో గల డంపింగ్ యార్డ్‌లో శనివారం యార్డ్ నిర్వహణపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రీన్ అంబాసిడర్లకు యార్డు నిర్వహణపై అవగాహన కలిగించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎండీవో కె.మ్యాథ్యూబాబు మాట్లాడుతూ గ్రామాలలో ఇళ్ల వద్ద సేకరించిన చెత్త, వ్యర్థపదార్థాలను అంబాసీడర్లు డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. ఇక్కడకు చేర్చిన చెత్తను తడి, పొడి చెత్తగా విభజించి ఎరువులుగా తయారు చేసి రైతులకు విక్రయించాలని తద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.అంకారావు మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది, అంబాసీడర్లు పాల్గొన్నారు.